సాక్షి కర్నూలు

బుధవారం । 7 । ఆగస్టు । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి మంగళవారం కర్నూలుకు చెందిన భైరెడ్డి సుభాస్ రెడ్డి రూ.1,00,116 విరాళమిచ్చారు.



అన్నదాత ఆశలకు 'గండి'

హంద్రీ-నీవా పథకం ప్రధాన కాలువకు పడిన గండి రైతన్న ఆశలపై నీళ్లు చల్లింది. అధికారులు మంగళవారం గండిని పూడ్చే పనులు చేపట్టి, పంట నష్టంపై అంచనాలు రూపొందించారు.

..8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,632.14
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 102.335
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 84,696
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 55,227

న్యూస్‌రీల్

ఈరన్నస్వామి భక్తులకు ప్రత్యేక రైలు

ఆదోని సెంట్రల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఉరుకుంద ఈరన్న స్వామి(నరసింహ స్వామి ఆలయం) దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైలు నడుపుతున్నారు. గుంతకల్లు ఆదోని వయా కుప్పగల్ మీదుగా రాయచూర్‌కు, రాయచూర్ నుంచి వయా కుప్పగల్ మీదుగా గుంతకల్లుకు రైలు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించాలనుకునే వారు కుప్పగల్ స్టేషన్‌లో దిగి ఉరుకుందకు వెళ్లవచ్చన్నారు. గుంతకల్లు స్టేషన్‌లో ఉదయం 5.30 గంటలకు రైలు బయలు దేరి 8.50 గంటలకు రాయచూర్ చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం రాయచూర్‌లో 3.30 గంటలకు బయలు దేరి 6.40 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుందన్నారు. వచ్చే నెల 3వ వరకు ఈ అవకాశం ఉంటుందని ఆయా ప్రాంతాల నుంచి ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సహకార సంఘాలకు 0.11 శాతం డివిడెండ్



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): సహకార సంఘాలకు 0.11 శాతం డివిడెండ్ ఫండ్‌ను కేటాయిస్తున్న ట్లు ఇన్‌చార్జ్ జేసీ/ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్ కె.మధుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం డీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీసీసీబీ పాలక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 0.11 శాతంతోసహకార సంఘాలకు డివిడెండ్‌ను డిక్లేర్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. హెచ్‌ఆర్ పాలసీ మేరకు సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కు రివైజ్‌డ్ డీఏను వర్తింపజేసేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. సమావేశంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయకుమార్,అడిషినల్ సీఈఓ రామాంజనేయులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ ఎగ్జామ్‌కు దరఖాస్తులు

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఎగ్జామ్‌కు 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కాగిత శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూళ్ల విద్యార్థులు అర్హులన్నారు. తమ కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు వచ్చే నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. ఈ ప్రక్రియ సోమవారం నుంచే మొదలైందన్నారు. పూర్తి వివరాలు www. bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు 11 మండలాల్లో వర్షాలు కురిశాయి. సి.బెళగల్‌లో 23 మిల్లీ మీటర్లు, మంత్రాలయంలో 20.2, కర్నూలు అర్బన్‌లో 15.2, కల్లూరులో 11.2, కర్నూలు రూరల్‌లో 6.4, కోసిగిలో 5.4, నందవరంలో 5 మిల్లీమీటర్ల చొప్పున వర్షాలు కురిశాయి. జిల్లా సగటున 3.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ కాగా ఆరు రోజుల్లో 8 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి కర్నూలు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.

రాజకీయం 'పారుతోంది'!

రైతులను ఆదుకోవాలి



ఎత్తిపోతల పథకాల పంపుహౌస్‌ల్లో తరచూ ధ్వంసానికి పాల్పడుతుండటంతో సాగునీరు లేకుండా పోయింది. ఇప్పటి వరకు చుక్క నీరు రిజర్వాయర్లకు ఎత్తిపోయలేదు. పంపుహౌస్‌లో రిపేర్లు చేసి వెంటనే రైతులకు సాగునీరు విడుదల చేయాలి. నదిలో నీరు ఉన్నా ఎత్తిపోత లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది.

– శ్రీనివాసరెడ్డి , కోసిగి

'ఎత్తిపోతల'పై విధ్వంసకాండ

- టీడీపీ అధికారంలోకి రాగానే 'గురురాఘవేంద్ర'లో దొంగలు
- పంపుహౌస్‌ల్లో రూ.2.76 కోట్ల విలువైన సామగ్రి ధ్వంసం
- కర్ణాటక ముఠా పాత్రపై అనుమానాలు
- రాజకీయం చేస్తున్న టీడీపీ నేతలు
- రోజులు గడుస్తున్నా పరిష్కారం చూపని టీడీపీ నేతలు



వృథాగా మారిన మూగలదొడ్డి ఎత్తిపోతల పథకం (ఇన్‌సెట్) చిలకలదోణ స్టేజ్-1 పంపుహౌస్‌లో ధ్వంసమైన స్టార్టర్లు

మంత్రాలయం: కూటమి ప్రభుత్వంలో ప్రతీది రాజకీయమే. అభివృద్ధిని పక్కనపెట్టి, హామీల విషయాన్ని గాలికొదిలేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం పరిపాటిగా మారింది. సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఊరట కల్పించాల్సిన నేతలు బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారు. పైగా ఆ తప్పును ప్రతిపక్షంపై నెట్టి చలి కాచుకునే ప్రయత్నం చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఈ కోవకు చెందినదే 'గురురాఘవేంద్ర' ఎత్తిపోతల పథకం. జిల్లా పశ్చిమాన ప్రధానమైన గురురాఘవేంద్ర ప్రాజెక్టులో ఇటీవల దుండగులు చొరబడుతుండటంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. చీకటి పడగానే పంపుహౌస్‌లను ధ్వంసం చేయడంతో పాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. అయితే ఇందుకు కారణాలను తెలుసుకోకుండా, మరమ్మతులకు చొరవ చూపకుండా వైఎస్సార్‌సీపీపై దుమ్మెత్తి పోయడమే పనిగా టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తుండటం గమనార్హం. చెంతనే నీరు పారుతున్నా అధికార పార్టీ నేతలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది.

ప్రాజెక్టు వివరాలు :

జిలా పశ్చిమాన తుంగభద్ర దిగువ కాలువ శివారు ఆయకట్టును సస్యశ్యామలం చేయాలనేది గురురాఘవేంద్ర ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. 1996లో ప్రాజెక్టు ప్రభుత్వ అనుమతులు పొందగా రూ.250 కోట్లు వెచ్చించి పూర్తి చేశారు. ప్రాజెక్టు పరిధిలో ఒక మైనర్ ఇరిగేషన్, 11 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. తుంగభద్ర నది వరద నీటిని ఎత్తిపోసి పంట పొలాలకు సాగునీరు అందించేలా నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు పరిధిలో 40వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మంత్రాలయం నియోజకవర్గంలో మూగలదొడ్డి, దుద్ది, మాధవరం, బసలదొడ్డి, ఎత్తిపోతలు, సూగూరు మైనర్ ఇరిగేషన్, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సోగనూరు, పూలచింత, చిలకలడోణ ఎత్తిపోతలు, కోడుమూరు నియోజకవర్గంలో కృష్ణదొడ్డి, చింతమాన్‌పల్లె లిఫ్టు ఇరిగేషన్ పథకాలు నెలకొల్పారు.

దుశ్చర్య వెనుక కర్ణాటక ముఠా

పంప్‌హౌస్‌ల విధ్వంస దుశ్చర్య వెనుక కర్ణాటక ముఠా ఉన్నట్లు తెలుస్తోంది. నిన్నటి వరకు టీడీపీ నేతలు ఈ ఘటనలకు రాజకీయం రంగు పులిమారు. బసలదొడ్డి స్టేజ్-1 పంపుహౌస్‌లో దొంగలు చొరబడిన సమయంలో మాధవరం పోలీసులు అక్కడకు చేరుకోవడంతో దొంగలు పరారయ్యారు. స్థానికంగా దొరికిన దుస్తులను బట్టి కర్ణాటక ముఠానే ఇదంతా చేస్తోందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.



బసలదొడ్డి స్టేజ్-1 పంపుహౌస్‌లో కాపర్‌ను ఎత్తుకెళ్లిన దృశ్యం

ప్రభుత్వ తీరుపై విమర్శలు

నదిలో వరద నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు తరలిపోతోంది. ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌ల్లో మర్మమతులు చేయకుండా అలక్ష్యం వహించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాకులు పక్కనబెట్టి వెంటనే పంపుహౌస్‌ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.2.70 కోట్ల నష్టం

మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల పరిధిలోని ఎత్తిపోతల పథకాలను టార్గెట్ చేసుకుని దుండగులు దుశ్చర్యకు పాల్పడుతున్నారు. తుంగభద్ర నదిని ఆనుకుని ఉన్న ఆరు ఎత్తిపోతల పథకాల పంపుహౌస్‌ల్లో విధ్వంసానికి పూనుకున్నారు.

- మంత్రాలయం పరిధిలోని మూగలదొడ్డి స్టేజ్-1 పంపుహౌస్‌తో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి 1200 కేజీ కాపర్‌ను దొంగలించారు. పంప్‌హౌస్‌లో రూ.18 లక్షలు నష్టం వాటిల్లింది.
- మాధవరం స్టేజ్-1 పంపుహౌస్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు స్టార్టర్లు, ఇన్సులేటర్, బ్రేకర్స్, బ్యాటరీలను నాశనం చేశారు. అందులో 9 కాపర్ షీట్లను ఎత్తుకెళ్లారు. కారణంగా రూ.1.46 కోట్లు నష్టం జరిగినట్లు ప్రాజెక్టు అధికారుల అంచనా.
- బసలదొడ్డి స్టేజ్-1 పంపుహౌస్‌లోనూ స్టార్ట ర్,బ్యాటరీలు, ఫీడర్లను ధ్వంసం చేయగా రూ. 12 లక్షలు నష్టం వాటినట్లు కేసు నమోదైంది.
- ఎమ్మిగనూరు పరిధిలోని సోగనూరు స్టేజ్-1 పంపుహౌస్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 1200 కేజీల కాపర్‌ను దొంగలించారు. పంప్‌హౌస్‌లో రూ.20 లక్షలు నష్టం జరిగింది.
- పూలచింత స్టేజ్-1, స్టేజ్-2 పంపుహౌస్‌లోనూ 4 ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్, ఆయిల్ ఎత్తుకెళ్లగా రూ.40 లక్షలు నష్టం వాటిల్లింది.
- చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2 పంపుహౌస్‌లో 4 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్, ఆయిన్ తీసుకెళ్లగా రూ.40 లక్షలు నష్టం జరిగిందని ప్రాజెక్టు అధికారుల అంచనా.

ప్రతిపాదనలు పంపాం

గురురాఘవేంద్ర ప్రాజెక్టు పంపుహౌస్‌ల్లో ఇటీవల దుండగులు దాడులు చేశారు. పంపుహౌస్‌ల మరమ్మతుల విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు కేటాయించగానే టెండర్లు పిలుస్తాం. టెండర్లు పూర్తయ్యాక మరమ్మతులు చేపడతాం. ఎత్తిపోతల పథకాలు ప్రారంభం కావడానికి నెల సమయం పట్టే అవకాశం ఉంది.

– భాస్కర్ రెడ్డి, గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

పెద్దాసుపత్రికి పెరిగిన ఓపీల సంఖ్య

- సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రికార్డు స్థాయిలో ఓపీ, ఐపీ కేసులు పెరిగాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విస్తరించిన సేవల మూలంగా జూలై మాసంలో ఎక్కువ కేసులు నమోదయ్యాయన్నారు. రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి మెరుగైన వైద్యసేవల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన 20 పడకల న్యూ క్యాజువాలిటీ, 12 వెంటిలేటర్ పడకల ఆర్‌ఐసీయూ విభాగాల ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రికి ప్రతిరోజూ గతంలో 2 వేల నుంచి 2,500 మంది ఓపీ రోగులు వచ్చేవారని, ఆరు నెలల నుంచి పోలిస్తే జూలై మాసంలోనే దాదాపు ప్రతిరోజూ 2,700 నుంచి 3 వేల మంది వరకు ఓపీ చూపించుకోవడానికి వచ్చారని తెలిపారు. ఏప్రిల్‌లో ఓపీ 60,515, ఐపీ 5,387, ప్రసవాలు 591, వైద్యపరీక్షలు 1,70,016, అల్ట్రాసౌండ్ స్కానింగ్ 10,373 నిర్వహించారన్నారు. జూలైలో ఓపీ 79,467, ఐపీ 7,142, వైద్యపరీక్షలు 2,40,267, అల్ట్రాసౌండ్ స్కాన్ 12,459 మందికి చేసినట్లు చెప్పారు. ఆసుపత్రి కార్పొరేట్ స్థాయిలో పోటీ పడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో బెస్ట్ క్వాలిఫైడ్ డాక్టర్స్, సిబ్బంది, అధునాతన పరికరాలు, డయాగ్నోస్టిక్ సేవలు ఉన్నందున ప్రతిరోజూ వేల సంఖ్యలో రోగులు వస్తున్నారని అన్నారు.

ఉద్యాన శాఖ రూ.1.44 కోట్లు విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖకు సంబంధించి సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్(ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద 2023-24 సంవత్సరానికి రూ.1.44 కోట్ల బడ్జెట్ విడుదలైనట్లు జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంఐడీహెచ్ కింద ఉద్యాన పంటల విస్తరణకు రూ.6.28 లక్షలు, పండ్లతోటల రెండో సంవత్సరం నిర్వహణకు రూ.6.19 లక్షలు, మూడో ఏడాది నిర్వహణకు రూ.5.54 కోట్లు, మల్చింగ్ కోసం రూ.1.93 లక్షలు, ఉద్యాన యాంత్రీకరణ కోసం రూ.14.25 లక్షలు, కలెక్షన్ సెంటర్లకు రూ.21 లక్షలు, ఫామ్‌పాండ్‌లకు రూ.16.25 లక్షల ప్రకారం రూ.66.89 లక్షలు విడుదలయ్యాయన్నారు. ఆర్‌కేవీవై కింద హైబ్రిడ్ కూరగాయల సాగుకు రూ.22.12 లక్షలు, కలెక్షన్ సెంటర్లకు రూ.49.87 లక్షలు, శీతల గిడ్డంగుల కోసం రూ.50 లక్షలు ప్రకారం రూ.77 కోట్లు విడుదలైనట్లు తెలిపారు.

బిందె నీళ్లివ్వండి

- ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయానికి వచ్చిన మహిళలు
- సమస్యను పరిష్కరించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు



ఖాళీ బిందెలతో మహిళలు



పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వెల్దుర్తి(కృష్ణగిరి): కనీసం బిందె నీళ్లైనా ఇవ్వాలని పలువురు మహిళలు పంచాయతీ కార్యాలయానికి వచ్చి అధికారును వేడుకున్నారు. ఈ ఘటన వెల్దుర్తిలో మంగళవారం చోటుచేసుకుంది. 20 రోజులుగా తమ కాలనీకి తాగు నీరందడం లేదని, ఎలా దాహం తీర్చుకోవాలంటూ 4, 5, 6 వార్డులకు చెందిన కొందరు మహిళలు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని అధికారులను నిలదీశారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు బొమ్మన రవిరెడ్డి విషయం తెలుసుకుని సర్పంచ్ ముత్యాల శైలజ, పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. పైప్‌లైన్ పగిలిపోవడంతోనే నీటి సరఫరా నిలిచిపోయిందని ఈఓఆర్డీ నరసింహులు, ఈఓ నాగేశ్వరరావు తెలుసుకుని పంచాయతీ వాటర్ వర్కర్స్‌తో మరమ్మతులు చేయించారు. ఇదిలా ఉండగా స్థానిక టీడీపీ నాయకులు తామే సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాలతో పనులు చేయించామంటూ సోషల్‌మీడియాలో ప్రచారం చేసుకోవడం విడ్డూరం.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే.. ఆలూరులో పెత్తనం

- డమ్మీగా మారిన టీడీపీ ఆలూరు ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్



05.08.24: ఆలూరులోని తన స్వగృహంలో నీటి సమస్యపై పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు, ఇతర పంచాయతీ అధికారులతో చర్చిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆలూరు టీడీపీలో గందరగోళం నెలకొంది. పార్టీ శ్రేణులు ఎవరి ఆధ్వర్యంలో పని చేయాలో తెలియక తికమకపడుతున్నారు. ఇప్పటికే ఉన్న గ్రూపులతో తలబొప్పి కడుతుండగా.. ఇప్పుడు ఏకంగా ప్రతిపాడు ఎమ్మెల్యే ఆలూరులో మకాం వేయడం గందరగోళానికి తావిస్తోంది. మాజీ సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ బూర్ల రామాంజినేయులు స్వస్థలం ఆలూరు పట్టణం. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఆయన అత్యంత సన్నిహితుడు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2024 ఎన్నికల్లో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా అవకాశం దక్కించుకొని గెలుపుపొందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన స్వగ్రామమైన ఆలూరుకు రావడంతో పెద్ద ఎత్తున స్వాగతం పలికి సన్మానించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామాంజినేయులు మాట్లాడిన మాటలు వివాదానికి తెరతీశాయి. ప్రత్తిపాడు, ఆలూరు నియోజకవర్గాలు తనకు రెండు కళ్లు అన్నారు. ఆలూరు అభివృద్ధే తన ధ్యేయమని, వేదావతి ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరిస్తానన్నారు. ఇక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పడం వివాదాస్పదమైంది. ఈయన ప్రత్తిపాడు ఎమ్మెల్యే కదా.. ఆలూరు నియోజకవర్గంపై పెత్తనం ఏంటని నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది.

మూడు రోజులుగా సమీక్షలు, సమావేశాలు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజినేయులు గత శనివారం నుంచి తన స్వగృహంలో అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారి కావడంతో అధికారులు కూడా ఆయనను కలవడానికి పెద్ద ఎత్తున వస్తున్నారు. ఆలూరు ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలిగితే సంహించేది లేదని అధికారులతో ఆయన చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. రెవెన్యూ, పంచాయతీ రాజ్‌తో పాటు ఇతర శాఖల అధికారులు ఆయన్ను కలుస్తున్నారు. వివిధ శాఖలకు చెందిన సమస్యలపై అర్జీలు స్వీకరిస్తుండటం గమనార్హం. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. భవిష్యత్‌లో ఆలూరు ఎస్సీ నియోజకవర్గం అవుతుందనే ఊహాగానాలతో ఆయన ఇప్పటి నుంచే ఇక్కడ మకాం వేయడం గమనార్హం.

డమ్మీగా మారిన వీరభద్ర గౌడ్

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి వీరభద్రగౌడ్ ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే ప్రత్తిపాడు ఎమ్మెల్యే రాకతో పరిస్థితి మారిపోయింది. అధికారులు, నాయకులు ఆయననే కలుస్తుండటంతో వీరభద్రగౌడ్ డమ్మీగా మారిపోయారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

త్రిశంకు స్వర్గంలో 'వలంటీర్లు'

- వలంటీర్ల సేవలపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- నిస్వార్థ సేవలకు రాజకీయ మరక
- మనసుకు గాయమై ఎన్నికల సమయంలో వేల మంది రాజీనామా
- తాము అధికారంలోకి వస్తే రూ.10 వేలు ఇస్తామన్న టీడీపీ
- మాట నిలబెట్టుకోకపోవడంపై సర్వత్రా ఆందోళన



కర్నూలులో వృద్ధురాలికి పింఛన్ పంపిణీకి ఐరిస్ తీసుకుంటున్న వలంటీర్(ఫైల్)

కర్నూలు(అర్బన్): మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులకు .. నడవలేని వృద్ధులకు .. దిక్కులేని అవ్వాతాతలకు వలంటీర్లే పెద్ద దిక్కుగా ఉండి విశేషసేవలందించారు. కరోనా కష్ట కాలంలో సైతం సొంత కుటుంబ సభ్యులే పట్టించుకోకపోయినా.. వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని ప్రజల దరికి చేర్చేందుకు ముందుండి పని చేశారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల పిల్లల ఉన్నత విద్యకు అవసరమైన సర్టిఫికెట్లను ఇంటి ముంగిట్లోకే అందించిన వలంటీర్లను కూటమి ప్రభుత్వం త్రిశంకు స్వర్గంలో పడేసింది. ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా అర్హులైన పేద, మధ్య తరగతి మహిళలకు అందించేందుకు కృషి చేసిన వీరిపై కరుణ చూపించాల్సింది పోయి కాఠిన్యాన్ని ప్రదర్శిస్తోంది. ప్రభుత్వం అందించే గౌరవ వేతనంతో తమకు కేటాయించిన 50 ఇళ్లలో వారు ఒక సభ్యుడిగా ఉంటూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజల తలలో నాలుకలా వ్యవహరించిన వలంటీర్లకు రాజకీయ రంగు అంటించారు.

నిస్వార్థ సేవలకు రాజకీయ మరక

సార్వత్రిక ఎన్నికల సమయంలో వలంటీర్లు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని సిటిజన్స్ ఫోరం ఫర్ డెమోక్రసీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. వారిని పింఛన్ల సహా అన్ని నగదు పంపిణీ ప్రయోజనాలకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో ఏప్రిల్ నెల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు మిగిలిన అన్ని కార్యక్రమాలకు వలంటీర్లు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను వెంటనే అప్పగించాలనే ఆదేశాల మేరకు అప్పట్లోనే జిల్లాలోని 29 క్లస్టర్లకు సంబంధించి 10,390 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేశారు. తమపై పడిన రాజకీయ రంగును జీర్ణించుకోలేని జిల్లాలోని 2,906 మంది వలంటీర్లు స్వచ్ఛందగా రాజీనామా చేశారు.

నిస్వార్థంగా అనేక రకాల సేవలను అందించిన వలంటీర్లు రాజకీయ స్వార్థానికి బలయ్యారు.

రూ.10వేల ఊసెత్తని కూటమి ప్రభుత్వం

నెలకు రూ.5 వేల గౌరవ వేతనంతో విస్తృత సేవలు అందిస్తున్న వలంటీర్లకు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబు ఎన్నికల సభల్లో ప్రకటించారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచిపోయినా వలంటీర్ల గురించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం వల్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా గతంలో వలంటీర్లు నిర్వహించిన అనేక రకాల పనులను నేడు సచివాలయ ఉద్యోగులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లతో చేయిస్తుండడం వల్ల ఇక తమ గురించి ప్రభుత్వం ఆలోచన చేయదనే అభిప్రాయాన్ని వలంటీర్లు వ్యక్తం చేస్తున్నారు. అలాగే జూన్ నెల వరకు వేతనాన్ని కూడా అందించలేదని వారు ఆరోపిస్తున్నారు.

లోక్ అదాలత్‌పై సమీక్ష

కర్నూలు(లీగల్): సెప్టెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయ సేవా సదన్‌లో అధికారులు, న్యాయవాదులతో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి సమీక్ష నిర్వహించారు. వీలైన న్ని కేసులు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు.



క్లుప్తంగా

యథేచ్ఛగా గుడుంబా విక్రయాలు


విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న నాటుసారా

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామంలో నాటుసారా పట్టపగలే గుభాలిస్తోంది. ఏకంగా ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న మారెమ్మ గుడి వద్ద నాటుసారాను విక్రయిస్తున్నారు. మంగళవారం సాయంత్రం విక్రయదారులు యథేచ్ఛగా నాటుసారాను విక్రయిస్తుండటంతో చూసిన చుట్టుపక్కల వాళ్లు, అటుగా వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక నాటుసారా విక్రయాలు ఊపందుకున్నాయని, అధికారులు కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అప్పలబాధతో రైతు ఆత్మహత్య

జూపాడుబంగ్లా: మండల కేంద్రమైన జూపాడు బంగ్లాకు చెందిన బొరుగుల వెంకటసుబ్బయ్య (69) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ లక్ష్మీ నారాయణ తెలిపిన వివరాల మేరకు...బొరుగుల వెంకటేశ్వర్లుకు ఎకరా సొంత పొలంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాడు. గత మూడేళ్లుగా సరైన దిగుబడులు లేక అప్పులు రూ.6 లక్షలకు చేరాయి. ఈ ఏడాది సాగు చేసిన పంటలు కూడా వర్షాభావ పరిస్థితులతో నష్టం వాటిల్లే అవకాశం ముందని మనస్తాపానికి గురయ్యాడు. దీంతో సోమవారం సాయంత్రం పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతిచెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఓబులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హాస్టల్ పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య


వీరేష్(ఫైల్)

కోడుమూరు రూరల్: హాస్టల్ భవనం పైనుంచి ఓ విద్యార్థి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో చోటు చేసుకుంది. దేవనకొండ మండలం పి.కోటకొండకు చెందిన కమ్మరి బ్రహ్మయ్య తన కుమారులైన కమ్మరి వీరేష్ (13), మనోహర్‌లను అమడగుంట్ల బీసీ హాస్టల్లో ఉంచి స్థానిక హైస్కూల్లో 8వ తరగతి, 7వ తరగతుల్లో చేర్పించాలని నిశ్చయించుకున్నాడు. ఈ మేరకు గత రెండు రోజుల కిందటనే ఇద్దరు కుమారులను హాస్టల్ వద్దకు తీసుకొచ్చి వదిలేసి వెళ్లాడు. మంగళవారం తండ్రి బ్రహ్మయ్య ఇద్దరు కుమారులకు సంబంధించిన టీసీలు, సర్టిఫికెట్లను తీసుకుని అమడగుంట్ల హాస్టల్ వద్దకు చేరుకుని, అక్కడ కుమారులతో మాట్లాడి పాఠశాల వద్దకు వెళ్లాడు. అయితే హాస్టల్లో ఉండి చదవడం ఇష్టం లేకనో, ఇతర కారణాల వల్లనో తెలియదు కానీ తండ్రి వెళ్లిన కొద్దిసేపటికి విద్యార్థి కమ్మరి వీరేష్ హాస్టల్ భవనంపై కిందకు దూకేయగా తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది గాయపడ్డ వీరేష్‌ను పెంచికలపాడులోని హాస్పిటల్‌కు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో వీరేష్ కోలుకోలేక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు అమడగుంట్ల హాస్టల్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించడంతో పాటు, విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా విద్యార్థి కమ్మరి వీరేష్‌ను అంతకుముందే కంబాలపాడు హాస్టల్లో చేర్పించగా, అక్కడ స్నేహితులెవ్వరు లేరని అమడగుంట్ల హాస్టల్లో ఉన్నారని అక్కడే చదువుకుంటానని చెప్పినట్లు తల్లిదండ్రులు రాధమ్మ, బ్రహ్మయ్యలు తెలిపారు. కుమారుల ఇష్టం మేరకే ఇద్దరినీ అమడగుంట్ల చేర్పించేందుకు వచ్చామని, ఇంతలోనే ఇంత అఘాయిత్యం జరిగిందంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ కోడుమూరులోని ప్రభుత్వాసుపత్రి వద్ద చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులను పరామర్శించారు.

అన్నదాత ఆశలకు 'గండి'


☛ ఈ మహిళ పేరు అల్లిబీ. వెల్దుర్తి మండలం మల్లెపల్లె గ్రామానికి చెందిన ఈమెకు .. కోడుమూరు మండలం లద్దగిరి రెవెన్యూ పరిధిలో 1.5 ఎకరాల పొలం ఉంది. కంది సాగు చేసింది. ఇప్పుడు ఆమె నిలబడిన ప్రాంతం కోతకు గురై కంది పైరు కొట్టుకుపోగా మిగిలిన కాలువను తలపిస్తున్న పొలం ఆమెది. 'ఈ కోతను మేమెలా పూడ్చుకోవాలో అర్థం కావడంలేదు. అధికారులు దయ ఉంచి మా పొలానికి మట్టి, ఇతరత్రా నష్ట పరిహారం అందించి న్యాయం చేయాలి' అని దీనంగా వేడుకుంటోంది.


గండి పూడ్చుతున్న దృశ్యం


నీట మునిగిన కల్లూరు మండలం కొంగనపాడు రెవెన్యూ పరిధి పొలాలు

- హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువకు పడిన గండితో రైతులకు తీవ్ర నష్టం
- గండి పూడ్చేందుకు అధికారుల ముమ్మర చర్యలు
- నష్టం అంచనాలో రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువకు పడిన గండి రైతన్న ఆశలపై నీళ్లు చల్లింది. పైప్రాంతాల నుంచి కురిసిన వర్షాల వల్ల హంద్రీనీవాకు అధికారులు మూడు రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. సోమవారం వెల్దుర్తి మండలం మల్లెపల్లె పంపింగ్ స్టేషన్(పీఎస్-3) అవతల గండి పడటంతో వందల ఎకరాలు నీట మునిగాయి. గండిని పూడ్చేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా సోమవారం రాత్రి పీఎస్-3 నుంచి విడుదల చేస్తున్న 6 పంపుల నీటిని నిలిపేశారు. కాలువలో నీటి పారకం అడుగుకు చేరుకున్న తరుణంలో మంగళవారం హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్-2 ఈఈ సురేశ్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో డీఈ హరిప్రసాద్, జేఈ హరీష్‌కుమార్ గండి పడిన ప్రాంతానికి చేరుకుని యంత్రాలతో గ్రావెల్, మట్టితో కరకట్ట నిర్మాణానికి ఉపక్రమించారు. దాదాపు 80 శాతం పనులు పూర్తి చేశామని, బుధవారానికి గండి పూర్తిగా పూడ్చివేసి, రెండ్రోజుల్లో కాలువకు నీటి సరఫరా అయ్యేలా చూస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ఈఈ తెలిపారు. గండి పడిన ప్రాంతం నుంచి నీరు పారి దెబ్బతిన్న రైతుల పొలాల రస్తా సైతం మరమ్మతులు చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

నష్టం అంచనాలో అధికారులు

కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఏడీఏ సాల్‌రెడ్డి, ఏఓ రవిప్రకాశ్, వెల్దుర్తి మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ముంపుకు గురైన నల్లరేగడి బురద పొలాల రైతులతో మాట్లాడారు. నష్టం అంచనా వేయాలని వీఆర్ఓలు, వ్యవసాయ సిబ్బందికి సూచించారు. వెల్దుర్తి, కోడుమూరు, కల్లూరు మండలాల పరిధిలోని లద్దగిరి, రామాపురం, మల్లెపల్లె, కొంగనపాడు గ్రామాలకు చెందిన దాదాపు 200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఆర్‌డీఓ, జేడీఏ తెలిపారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే గండి పడిన ప్రాంతాన్ని, నష్టం జరిగిన పొలాలను సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, రామకృష్ణ, గురుశేఖర్, నగేశ, వెల్దుర్తి రాజు తదితరులు పరిశీలించారు. రైతులతో, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో, వ్యవసాయ శాఖ జేడీఏతో మాట్లాడారు. గండిని త్వరగా పూడ్చి రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

లక్షలు ఖర్చు పెట్టినా మా పొలం బాగు చేసుకోలేం



నాకు ఉన్న 3.5 ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు పంట వేశాను. కాలువకు గండి పడి నా పొలంలో నుంచి నీళ్లు పారి భూమి కోతకు గురై పొలం కాస్తా వంకగా మారింది. పంట నష్టం, భూమి నష్టం జరిగింది. రూ.లక్షలు ఖర్చు పెట్టినా పొలం సాగు చేసుకోవడం కష్టం. అధికారులే న్యాయం చేయాలి.

– ఎస్ నగేశ్, రామాపురం, కోడుమూరు మండలం

కోతకు గురైందన్నా పట్టించుకోవడంలేదు



కాలువకు గండి పడి కల్లూరు మండలం కొంగనపాడు రెవెన్యూ పరిధిలోని నా 4 ఎకరాలతోపాటు, మా గ్రామానికి చెందిన రైతులకు చెందిన 25 ఎకరాలు కోతకు గురైంది. తిరిగి సాగులోకి తేవాలంటే కష్టం. నష్టం అంచనాకు వచ్చిన వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు సైతం పంట వేయలేదు కదా పరిహారం కోసం ఎలా రాయాలంటూ వెనుదిరిగిపోయారు. పంట వేసుకోవాల్సిన తరుణంలో భూమి కోతతో మా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

– గోపాల్, మల్లెపల్లె, వెల్దుర్తి మండలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లాలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాఘవరాజుపల్లెకు చెందిన అంబటి సూర్యనారాయణ రెడ్డి (65) మృతి చెందాడు. సొంత ట్రాక్టర్‌లో నాపరాళ్లను లోడ్ చేసుకొని పామిడి వైపు డ్రైవర్ ఒంటరిగా వెళ్తుండటంతో అతను తోడుగా వెళ్లాడు. మార్గమధ్యలో అనంతపురం జిల్లాలోని పెద్దవడుగూరు – లక్ష్మంపల్లె గ్రామాల మధ్యలో అదుపు తప్పిన ట్రాక్టర్ బోల్తా పడింది. ఇంజన్ భాగంలో కూర్చున్న సూర్యనారాయణరెడ్డిపై ట్రాలీలో ఉన్న నాపరాళ్లు మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

కర్నూలు: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది కర్నూలు గణేష్ నగర్‌లో నివాసముంటున్న వడ్డె జయరాముడు (34) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి 8 ఏళ్ల క్రితం బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వడ్డె భార్గవితో వివాహమయ్యింది. ఇప్పటివరకు సంతానం కలుగలేదు. ఈ విషయంలో భార్యభర్తల మధ్య తరచూ గొడవ జరిగేది. జయరాముడు భార్య భార్గవి నెల రోజుల క్రితం పీర్ల పండుగకు పుట్టింటికి వెళ్లింది. తిరిగి కాపురానికి కర్నూలుకు రమ్మని భర్త పిలిచినా రాకపోవడంతో.. జయరాముడు మనస్తాపం చెంది సోమవారం అర్ధరాత్రి ఇంట్లో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గుర్తించి ఉరి నుంచి తప్పించి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. జయరాముడు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

ప్రాణాలు తీసిన ఫైనాన్స్ అప్పులు


ఆంజనేయులు(ఫైల్)

కోవెలకుంట్ల: ఫైనాన్స్ అప్పులు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ మంగళవారం అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న ఆంజనేయులు(38) వివిధ ఫైనాన్స్ కంపెనీల నుంచి రూ.20 లక్షల దాకా అప్పులు తీసుకుని రెండు లారీలు కొనుగోలు చేశాడు. లారీలను బాడుగలకు పంపుతూ వచ్చే ఆదాయంతో భార్య దుర్గ, కుమారుడు కల్యాణ్‌ను పోషించుకుంటున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించాలంటూ కొన్ని రోజుల నుంచి ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నారు. వారి ఒత్తిడిని తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మృతుని భార్య దుర్గ ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

ఆలూరు రూరల్: సెబ్ పోలీసులు మంగవారం భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణంలో జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్‌తో కలిసి ఆలూరు ఇన్‌చార్జ్ సీఐ మల్లిక విలేకరులకు వెల్లడించారు. మండలంలోని కురుకుంద-కమ్మరచేడు గ్రామాల రహదారిలో తెల్లవారు జామున సెబ్ పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. బొలేరో వాహనంలో తరలిస్తున్న 54 బాక్సుల కర్ణాటక మద్యం (5,154 టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్, 4464 లీటర్లు) గుర్తించారు. బొలేరో వాహనంతోపాటు రూ.2.2 లక్షల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేశారు. డ్రైవర్ సలీంను అరెస్ట్ చేసి తమదైన శైలిలో విచారించగా హొళగుంద మండల కేంద్రానికి చెందిన దుర్గన్న ఆలూరు ప్రాంతానికి చెందిన మద్యం వ్యాపారులు హరిప్రసాద్, మురళి, శేఖర్‌లకు చేరవేసేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించడంతో ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపా రు. నిందితుల కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలో పట్టుకుంటామని ఆమె తెలిపారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ వీరస్వామి, పోలీసు సిబ్బంది శ్రీనివాసులు, బాదుల్లా పాల్గొన్నారు.

నీటి గుంతలో పడిన విద్యార్థినులు

- తోటి విద్యార్థిని సమయస్ఫూర్తితో తప్పిన ప్రాణాపాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ నీటి గుంతలో మంగళవారం ఇద్దరు విద్యార్థినులు పడిపోగా తోటి విద్యార్థిని సమయస్ఫూర్తితో ప్రాణాపాయం తప్పింది. విద్యార్థినులు తెలిపిన వివరాలు.. మధ్యాహ్న భోజనం సమయంలో పదో తరగతి విద్యార్థినులు మంజుల, సన నీటి గుంత పైకప్పుపై నిలబడి ప్లేట్లు శుభ్రం చేసుకుంటుండగా గుంత పైకప్పు సిమెంట్ మూత విరిగి అందులో పడిపోయారు. పక్కనే ఉన్న తోటి విద్యార్థిని ప్రతిభామాధురి భూమిపై పడుకుని, గుంతలోకి చేతులు చాచి ఇరువురిని బలంగా పైకి లాగేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఇదే విషయమై హెచ్ఎం చంద్రావతి మాట్లాడుతూ విద్యార్థినులు బురద గుంతలో పడ్డారని తెలిసి, వారిని ఇంటికి పంపించామన్నారు.

బాబు గారూ.. పింఛను ఎప్పుడిస్తారు?

- వారం రోజులుగా విశ్రాంత ఉద్యోగుల ఎదురుచూపు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం పెన్షనర్లను నిర్లక్ష్యం చేస్తోంది. పింఛను సొమ్ము చెల్లింపులో మీనమేషాలు లెక్కిస్తోంది. వారం రోజులు గడుస్తున్నా ఒక్కరికీ పింఛను అందకపోవడంతో లోలోపల కుమిలిపోతున్నారు. చంద్రబాబు వస్తే పింఛను సక్రమంగా ఒకటో తారీఖున వస్తుందనుకుంటే ఈయన గత టీడీపీ పాలననే గుర్తు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రానికి, విభజిత రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వహించారు. పెన్షనర్లకు డీఏ ఎందుకు దండగ అన్న సందర్భాలు కూడా ఉన్నాయి. మళ్లీ అదే పరిస్థితి పునరావృతం అయ్యే పరిస్థితి కనిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ చెల్లించాలనేది డిమాండ్. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఒకటో తేదీన వేతనాలు, పెన్షన్ చెల్లించడం లేదనే విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు ఎన్నికల్లో ఆ పార్టీ వ్యతిరేకంగా పనిచేశారనే చర్చ కొనసాగుతోంది. అయితే వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం కొంత ఆలస్యంగా ఇచ్చిందే తప్ప ఏనాడూ ఎగ్గొట్టిన దాఖలాలు లేవు. ఇదిలాఉంటే టీడీపీ ప్రభుత్వంలోనూ జూన్ నెల వేతనం జూలై 2 నుంచి 4వ తేదీ వరకు విడతల వారిగా పడింది. పెన్షనర్లకు మరీ ఆలస్యంగా పెన్షన్ చెల్లించారు. జూలై నెల పెన్షన్ చెల్లించడంలో కూడా జాప్యం జరుగుతుండటం పట్ల ఉమ్మడి జిల్లాలోని దాదాపు 28వేల మంది పెన్షనర్లు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.

కక్షగట్టిన ప్రభుత్వం

ప్రతి రోజు పెన్షనర్లు బ్యాంకులకు వెళ్లి పెన్షన్ పడిందా? లేదా? అని బ్యాలెన్స్ చెక్ చేసుకుంటున్నారు. సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులకు ఆయా శాఖలకు చెందిన డీడీవోలు వేతనాల బిల్లులు సీఎఫ్ఎంఎస్ ద్వారా ట్రెజరీలకు పంపుతారు. పెన్షనర్లకు మాత్రం సంబంధిత సబ్ ట్రెజరీ అధికారులే డీడీవోలుగా వ్యవహరిస్తారు. సబ్ ట్రెజరీ అధికారులు పెన్షన్ బిల్లులను గడువులోపే సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా పెన్షనర్లకు పెన్షన్ చెల్లించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వారం రోజులైనా పెన్షన్ లేదు



జూలై నెలలోనూ పెన్షన్ చెల్లింపులో జాప్యం జరిగింది. కొత్త ప్రభుత్వం ఇబ్బందులు ఉంటాయిలే అనుకున్నాం. ఈ నెలలోనైనా 1వ తేదీన బ్యాంకు ఖాతాలకు పింఛను జమ అవుతుందనుకున్నాం. కానీ వారం రోజులవుతున్నా ఆ ఊసే లేదు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షనే ఆధారం. ఎన్నో సమస్యలు కాచుకొని ఉంటాయి. ఇలా ఆలస్యం చేస్తుంటే మేము బతికేదెట్లా.

– వివి.శ్రీనివాసులు, ఆర్అండ్‌బి రిటైర్డ్ ఈఈ

రోజూ బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాం



పెన్షన్ పడిందేమోనని ఈ నెల 1వ తేదీ నుంచి ప్రతి రోజూ బ్యాంకుకు వెళ్లి చెక్ చేసుకుంటున్నాం. నిరాశే మిగులుతోంది. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయితే ప్రతి నెలా 1వ తేదీనే పెన్షన్ వస్తుందని నమ్మాం. అయితే వారం రోజులు గడుస్తున్నా పింఛను సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఒకటవ తేదీనే పెన్షన్ చెల్లించాలి.

– శివరామిరెడ్డి, విశ్రాంత వెటర్నరీ ఉద్యోగి

బడి బహుదూరం

- చదువుకోవాలంటే 5 కిలోమీటర్లు నడవాల్సిందే
- నాలుగు గ్రామాల విద్యార్థులకు తప్పని నడక తిప్పలు


నేమకల్లు హైస్కూల్ నుంచి నడిచి వస్తున్న విద్యార్థులు

చిప్పగిరి: పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం ఈ ఫొటో. భుజాన పుస్తకాల బరువుతో కాలినడకన వెళ్తున్న ఈ విద్యార్థులు రోజూ ఐదు కిలోమీటర్ల రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలో 5 జెడ్పీహెచ్ స్కూళ్లలో నేమకల్లు జెడ్పీ హైస్కూల్ ఒకటి. ఈ స్కూల్‌కు నేమకల్లుతోపాటు నగరడోణ, బెల్డోణ, సంగాల, తిమ్మాపురం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారు. బెల్డోణ, నగరడోణ విద్యార్థులు బస్, ఆటోలో నేమకల్లు క్రాస్ రోడ్డు వరకు చేరుకుని అక్కడి నుంచి కాలినడకన పాఠశాలకు చేరుకుంటున్నారు. మిగతా సంగాల, తిమ్మాపురం గ్రామాల నుంచి ఎలాంటి బస్, ఆటో సౌకర్యం లేకపోవడంతో దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేమకల్లు పాఠశాలకు నడిచి పోవాల్సిన పరిస్థితి. తమ తమ సొంత గ్రామాల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని హైస్కూల్‌కు వెళ్లాలంటే మాత్రం ఇలా నడక తప్పని సరి అని విద్యార్థులు వాపోతున్నారు.

వెంకటాపురం పోస్టాఫీసులో గోల్‌మాల్

- రూ. 4 లక్షల నిధులు స్వాహా
- పోస్టుమాస్టర్ భర్తే సూత్రధారి


గ్రామ ప్రజలను విచారిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు

డోన్ టౌన్: పేదల కష్టార్జితాన్ని పోస్టల్ అధికారులు కాజేశారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా వెంకటాపురం గ్రామంలో కొందరు పేదలు ఆర్‌డీలు, గ్రామీణ తపాల బీమా, సేవింగ్ ఖాతాల రూపంలో దాచుకున్న డబ్బును దోచేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంకటాపురం పోస్టాఫీసు పరిధిలో నాలుగు గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల ప్రజలు ఈ పోస్టాఫీసులో పొదుపు చేస్తున్నారు. ఆ సొమ్మును పోస్టల్ అధికారులు కుమ్మక్కై స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఖాతాదారుల పుస్తకాల్లో నమోదు చేయకుండా కొంత, వసూలు చేసిన సొమ్మును పోస్టల్ శాఖకు జమ చేయకుండా మరి కొంత కాజేసినట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 4 లక్షలు స్వాహా చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. నిధుల స్వాహా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో కర్నూలు జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా గ్రామంలో విచారణ జరుగుతోంది. అధికారికంగా రూ.2లక్షల వరకు ఇన్‌చార్జ్ పోస్ట్‌మాస్టర్‌గా వ్యవహరించిన శ్రీనివాసులు వాడుకున్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. అనధికారికంగా మరో రూ. 2 లక్షలు కూడా కాజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఏఎస్‌పీ విజయ్‌మోహన్ మాట్లాడుతూ వెంకటాపురం బ్రాంచ్ రెగ్యులర్ పోస్టుమాస్టర్ మయూరి ప్రసూతీ సెలవులపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్న ఆమె భర్త శ్రీనివాసులు అక్రమాలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఇందులో ప్రతి మూడు నెలలకు తనిఖీలు చేసే మెయిల్ ఓవర్‌సీల్ అధికారి నిర్లక్ష్యంపై ప్రజలు ప్రశ్నించగా అధికారులు దాట వేశారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ కర్నూలు-నంద్యాల రోడ్, రాగమయూరి ప్రక్కన 30x45 సైజులో ఇల్లు కట్టించి ఇవ్వబడును. మరియు ఓర్వకల్లు, తిప్పాయిపల్లె రోడ్‌లో నూతన వెంచర్‌లో తక్కువ ధరకు ప్లాట్లు కలవు. ✆ 9963800314. [L-796509]

SERVICES

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

WANTED

■ WORK FROM HOME: APTS NEWS యాప్‌లో వర్క్ ఫ్రం హోమ్ జాబ్స్ ఫ్రీగా ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ఇస్తాం. Female Telecallers కావలెను. జీతం: 15వేలు పైన. ఫోన్: 9966676646. [L-796422]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185276]

■ Wanted PET (Physical Education Teacher), A.O (Administration Officer) Sri Chaitanya High School. Cont : 9502485242, 7396879051 [C-1254041]

■ కష్టలెస్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను జీ:15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph: 8317512135 [HA-98107]

■ అర్జెంట్‌గా పాణ్యంలో మూతపడ్డ కంపెని రైల్వే గేట్ ప్రక్కన వాచ్‌మెన్, సూపర్ వైజర్‌గా పని చేయుటకు కావలెను. జీతం: 6000/- Email. mktg.sec2011@gmail.com సంప్ర: 9440050036,9010225259 [H-79 6664]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సుప్రీం తీర్పుతో మాలలకు తీవ్ర అన్యాయం


కలెక్టరేట్ ఎదుట మాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చి తీర్పుతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాల జేఏసీ చైర్మన్ యాట ఓబులేష్ అన్నారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ అంబేద్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు మాల సంఘాల జేఏసీ పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించింది. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ మాలలకు అన్యాయం చేస్తే ప్రభుత్వాలను కూల్చుతామని హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదం లేకుండా ఎస్సీ వర్గీకరణను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. వర్గీకరణతో దళితులందరికీ అన్యాయం జరుగతుందన్నారు. రాజకీయ నాయకుల కుర్చీలు పెకిలించే సత్తా మాలలకు ఉందని, ఆ విషయాన్ని కొన్ని పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు చంద్రమౌళి జ్యోతి, మునయ్య, మాధవస్వామి, మాదాసు నాగరాజు, వెంకటేష్, రాజీవి, కుందా వెంకటేష్, సామెల్,నవీన్, నాగేష్, గిడ్డయ్య పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహానందిలో ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన ఆకతాయిలకు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి తీర్పు ఇచ్చినట్లు మహానంది పోలీసులు తెలిపారు. ఈశ్వర్‌నగర్ కాలనీలో సుధీర్, రమేష్, సురేష్‌కుమార్, చిన్నబాబు, ఆంజనేయులు ఈలలు వేస్తూ, సైగలు చేస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారు. స్థానికుల ఫిర్యాదుతో వారిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి 10 రోజుల చొప్పున జైలు శిక్షను ఖరారు చేసినట్లు మహానంది పోలీసులు తెలిపారు.

వ్యవసాయ కళాశాలలో బదిలీలు

మహానంది: స్థానిక వ్యవసాయ కళాశాల సైంటిస్ట్ డాక్టర్ కవిత అనంతపురం జిల్లాలోని అగ్రికల్చర్ రీసర్చ్ స్టేషన్‌కు బదిలీ అయ్యారని కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. డాక్టర్ కవితతో పాటు కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి నెల్లూరు జిల్లాకు, డాక్టర్ రవికిషోర్ కర్నూలు జిల్లా ఏరువాక కేంద్రానికి బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా రీసర్చ్ స్టేషన్‌లో పనిచేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, శివజ్యోతి, వైఎస్సార్ జిల్లా నుంచి కృష్ణప్రియలను మహానంది వ్యవసాయ కళాశాలకు బదిలీ చేస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

నరకయాతన




డ్రైవర్‌ను రక్షిస్తున్న పోలీసులు, స్థానికులు, తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ మనోహరన్

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కంటైనర్
- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్
- రెండు గంటల పాటు శ్రమించి బయటకు తీసిన పోలీసులు

చాగలమర్రి: రెండు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో కంటైనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రెండు గంటల పాటు నరకయాతన అనుభవించాడు. ఈ ఘటన నంద్యాల – చిత్తూరు జాతీయ రహదారిపై పెద్దబోధనం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ వైపు నుంచి చెన్నైకి వెళ్తున్న లారీ పెద్ద బోధనం సమీపంలో టైరు పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపారు. అదే మార్గంలో వస్తున్న కంటైనర్ వాహనం నిలిచి ఉన్న లారీని వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొంది. దీంతో కంటైనర్ డ్రైవర్ మనోహరన్ తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న చాగలమర్రి ఎస్ఐ రమణయ్య సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి గడార్లతో క్యాబిన్‌ను పగులగొట్టి డ్రైవర్‌ను బయటకు తీశారు. కాలికి తీవ్ర గాయమై రక్త స్రావం అవుతున్న అతడిని చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.